క్లుప్తంగా

నేడు రాజ్యాంగ రక్షణ బహిరంగ సభ


మల్లికార్జున్

బెజ్జంకి(సిద్దిపేట): హైదరాబాద్ ఉప్పల్ బొమ్మక్ బాలయ్య ఫంక్షన్ హాల్‌లో సోమవారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ రక్షణ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాసూరి మల్లికార్జున్ ఆదివారం ఒక ప్రకటలో పిలుపునిచ్చారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ టీజేఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, ఐఏఎస్ మురళి, మల్లేపల్లి లక్ష్మయ్య తదితరులు హాజరై దిశా నిర్దేశం చేస్తారన్నారు. ప్రజాస్వామిక వాదులు, నిరుద్యోగులు, విద్యావంతులు, మేధావులు తరలిరావాలని కోరారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

దుబ్బాకటౌన్: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. దుబ్బాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, లచ్చపేట మోడల్ స్కూల్లో పరీక్ష నిర్వహించారు. రెండు కేంద్రాల్లో మొత్తం 563 మంది విద్యార్థులకుగాను 533 మంది హాజరైనట్లు ఎంఈఓ జోగు ప్రభుదాస్ తెలిపారు. 6వ తరగతి ప్రవేశానికి 343 మంది దరఖాస్తు చేసుకోగా 330 మంది, అలాగే 7 నుంచి 10వ తరగతి ప్రవేశానికి 220 మంది దరఖాస్తు చేసుకోగా 203 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీకేజీతో ఇక్కట్లు


కాలనీలో నిలిచిన మురుగు నీరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీకేజీతో ఇక్కట్లు పడుతున్నామని జిల్లా కేంద్రంలోని శ్రీనివాస నగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా అండర్ గ్రౌండ్ లీకేజీతో ఇళ్ల మధ్య మురుగు పారుతోందని చెబుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ పారిశుద్ధ్య కార్మికుడి మృతి


స్వామి (ఫైల్)

దుబ్బాకరూరల్: చికిత్స పొందుతూ పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిద్దె స్వామి(37) గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటు రావడంతో శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోటి తలంబ్రాల దీక్ష


జగదేవ్‌పూర్‌లో తలంబ్రాలను చేస్తున్న రామ భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): భద్రాచల సీతారాముల కల్యాణానికి గ్రామ గ్రామాన కోటి తలంబ్రాల దీక్ష చేపట్టారు. వడ్లను గోటితో ఒలిచి తలంబ్రాలుగా చేయించే బాధ్యత భద్రాచలం దేవస్థానం గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజానికి అప్పగించింది. ఆదివారం జగదేవ్‌పూర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గోటి తలంబ్రాల కార్యక్రమం నిర్వహించగా భక్తులు హాజరై మూడు గంటల పాటు రామ నామ స్మరణ చేస్తూ తలంబ్రాలు చేశారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

గజ్వేల్‌రూరల్: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజులు గడిచినా వారిని పట్టించుకోలేదని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో విలేకర్లతో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీలని విస్మరించి రైతులను నట్టేట ముంచిందన్నారు. పంట నష్టపోయిన రైతులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పంట నష్టం కింద పరిహారం రూ.25 వేలు అందించాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల మధ్య కుంట.. ప్రజలకు తంటా


తిగుల్ గ్రామంలో ఇళ్ల మధ్య ఉన్న మురుగు కుంట

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇళ్ల మధ్య మురుగు గుంత.. పందుల స్వైర విహారం..చెత్త చెదారంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతోంది... వెరసి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇదీ జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్‌గ్రామంలో గుడికుంట పరిస్థితి. ఈ కుంట ఇళ్ల మధ్య ఉంది. గతంలో వర్షపు నీరు దర్శనమిచ్చేది, ప్రస్తుతం మురుగు, చెత్తచెదారంతో నిండింది. అప్పటి కలెక్టర్ వెంక్రటామిరెడ్డి గ్రామానికి వచ్చినప్పుడు కుంటను చూసి దానిని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. అయినా కుంటను పూడ్చలేదు. ఇళ్లలో నుంచి వాడకం నీరంతా ఈ కుంటలో చేరుతోంది. గ్రామస్తులు కూడా చెత్తచెదారాన్ని ఇందులోనే పారబోస్తున్నారు. పందులకు ఆవాసంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ముక్కుమూసుకొని ఈ కుంట పక్కనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. కుంటను పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చేర్యాల న్యాయవాదుల అడహాక్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన అడహాక్ కమిటీ సభ్యులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల ప్రాంత న్యాయవాదుల అడహాక్ కమిటీ కన్వీనర్‌గా పట్టణ కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది ఆరెళ్ల వీరమల్లయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణ కేంద్రంలో నూతనంగా మంజూరైన కోర్టు ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చేర్యాల కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు సమావేశమయ్యారు. సమావేశంలో అడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఆరెళ్ల వీరమల్లయ్యగౌడ్, కో–కన్వీనర్లుగా గాజుల రవీందర్, మేరుగు రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజనలో ఈ ప్రాంతం సిద్దిపేట జిల్లాలో విలీనమైన నేపథ్యంలో కక్షిదారులు ఇబ్బందులకు గురవుతున్నారనే భావనతో చేర్యాల న్యాయవాదుల ఆధ్వర్యంలో కోర్టు ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. వారి కృషి ఫలితంగా మంజూరైన కోర్టు ఏర్పాటు పనులు కొన్ని అనివార్య కారణాలతో వాయిదా పడుతోందని, ఆ పనులు త్వరగా పూర్తి చేసేందుకు అడహాక్ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిశారు. సమావేశంలో కమిటీ కార్యవర్గ సభ్యులు గూడెం శ్రీధర్, మోకు రాజిరెడ్డి, నల్లగొండ సంతోష్, గుస్క వెంకటేష్, నీరటి వెంకటేష్, దర్శనం ప్రశాంత్, అనంతోజు వెంకట కృష్ణ, పొన్నం వెంకటేష్, సౌమ్య, కుర్రి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఎఫ్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్


నియామక పత్రం అందుకుంటున్న శ్రావణ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్(ఎన్‌టీఎఫ్) రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన కెమ్మసారం శ్రావణ్ నియమితులయ్యారని జిల్లా అధ్యక్షుడు కెమ్మసారం శ్రీనివాస్ తెలిపారు. శ్రావణ్‌కు ఆదివారం హైదరాబాద్ ఎన్‌టీఫ్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వలువాయి ఉషాకిరణ్ నియామక పత్రాన్ని అందజేశారన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

ములుగు(గజ్వేల్): కేబుల్ వైరు దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ములుగు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి చోరీ వివరాలు వెల్లడించారు. మండలంలోని వంటిమామిడి గ్రామానికి చెందిన పర్వత్ సంజయ్, మంద ప్రశాంత్ చిన్ననాటి స్నేహితులు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరు మద్యానికి అలవాటు పడ్డారు. తమ జల్సా కోసం దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. మార్చి 17వ తేదీ రాత్రి పల్లెప్రకృతి వనం సమీప సన్నిదానం వద్ద ఉన్న బోరు మోటారు వైర్, ఆ తరువాత శ్మశానవాటిక, హనుమాన్ ఆలయంలోని బోరు మోటారు వైరు దొంగిలించారు. చోరీ చేసిన వైరులో కొంత తుక్క వ్యాపారికి రూ.2 వేలకు విక్రయించారు. మిగిలిన వైర్‌ను వంటిమామిడి అటవీ ప్రాంతంలో కాల్చి, ఆ కాపర్ వైర్‌ను తీసుకుని విక్రయించేందుకు వెళ్తుండగా ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ పట్టుకున్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల నుంచి కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో డిపాజిట్ చేసినట్లు సీఐ తెలిపారు.



నిందితులను చూపుతున్న గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

పేరు తెచ్చిన గడ్డకు సేవచేస్తా

బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి


మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): కలెక్టర్‌గా తనకు పేరు తెచ్చిన సిద్దిపేట గడ్డకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా ఆదివారం సిద్దన్నపేటలో నంగునూరు మండల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు పేద ప్రజలకు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. తొమ్మిదేళ్లలో కరెంటు కష్టాలు చూడలేదని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరెంట్ కష్టాలు అనుభవిస్తున్నామన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజల గొంతునై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, జెడ్పీటీసీ ఉమ, మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, పద్మ, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతి, జిల్లా, మండల, గ్రామ పార్టీ నాయకులు, విద్యార్థి, యువజన విభాగం సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతయ్యకు పండిత పురస్కారం


పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ అర్చకుడు పానుగంటి తిరుపతయ్యకు ఆదివారం సిద్దిపేట జిల్లా విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని అందజేశారు. గతంలో ఈయనకు స్వర్ణ నంది అవార్డు, జ్యోతిర్వాస్తు పురోహిత నిధి బిరుదుతో సత్కరించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ఉగాది మహోత్సవ పండిత పురస్కారాన్ని అందజేసిన విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కాగా ఉగాది పురస్కారం అందుకున్న తిరుపతయ్యను గ్రామస్తులు అభినందించారు.

ఎల్లారెడ్డిపేట మినీగోదాం పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన మినీ గోదాం నిర్మాణంపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిర్మాణ దశలోనే శిథిలం కథనాన్ని ఆదివారం సాక్షి దినపత్రిక ప్రచురించింది. దీంతో జిల్లా ఇంటిలిజెన్స్ అధికారులు ఎల్లారెడ్డిపేటలోని గోదాంను పరిశీలించారు. గోదాం నిర్మాణ పనులు నిలిచిపోయి ఎనిమిదేళ్లు గడుస్తుందన్న విషయంపై గ్రామస్తులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. గోదాం నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎవరు? మధ్యలో నిర్మాణం ఎందుకు నిలిపివేశారని ఆరాతీశారు. మాజీ సర్పంచ్ బుర్ర అనితను వివరాలు అడిగితెలుసుకున్నారు. అలాగే నీటిపారుదల శాఖ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. గోదాం నిర్మాణంపై పూర్తి సమాచారం సేకరించి ప్రభుత్వానికి ఇంటిలిజెన్స్ అధికారులు నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం.

ఆరోగ్యానికి ఆటలు దోహదం


బహుమతులను ప్రదానం చేస్తున్న శ్రీనివాస్ యాదవ్

ములుగు(గజ్వేల్): ఆరోగ్యం, శారీరక దారుఢ్యానికి ఆటలు దోహదపడతాయని ములుగు మండలం అచ్చాయిపల్లి గ్రామ కమిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సలెంద్రి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం అచ్చాయిపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ.15 వేలు, రన్నర్ జట్టుకు రూ.5 వేల నగదు బహుమతులు, ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఆటలకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు చెలం, నాయకులు భూపాల్‌రెడ్డి, కనికేష్, వినోద్‌కుమార్, పోచయ్య, నర్సింహులు, రాజు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం కేంద్రం నిర్వాహకురాలు జేబా తబస్సు గ్రామ రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో రైతు షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

మిరుదొడ్డి(దుబ్బాక): బైక్ అదుపు తప్పడం రోడ్డుపై పడి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్, వీరారెడ్డిపల్లి శివారులో ఆదివారం జరిగింది. మండల పరిధిలోని జంగపల్లి గ్రామానికి చెందిన అంతటి మల్లేశం బైక్‌పై వీరారెడ్డిపల్లి నుంచి ఖాజీపూర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు గ్రామాల మధ్య శివారులోఉన్న రైస్ మిల్లు వద్ద అదుపు తప్పడంతో కిందపడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దౌల్తాబాద్ 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మల్లేశంకు ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మట్టి స్నానంతో ఆరోగ్యం

సిద్దిపేటజోన్: వ్యాస మహర్షి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మడ్ బాత్ (మట్టి స్నానం) కార్యక్రమం నిర్వహించారు. చంద్రమౌళి గార్డెన్స్‌లో నిర్వహించిన మడ్ బాత్‌కు పెద్ద ఎత్తున పట్టణ వాసులు హాజరయ్యారు. ప్రాచీన కాలం నుంచి వస్తున్న మట్టి స్నానంతో మనిషికి ఎన్నో లాభాలు ఉన్నాయని ప్రముఖ వైద్యుడు స్వామి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు రాంరెడ్డి, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మడ్‌బాత్‌తో ప్రయోజనాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదియోగి పరమేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మడ్ బాత్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు యోగాచార్యుల సిద్ది రాములు మాట్లాడుతూ బంకమట్టి స్నానంతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. మలినాలు బయటకు పోవడంతో పాటు శరీరం చల్లబడుతుందన్నారు.


మడ్‌బాత్‌చేస్తున్న పట్టణ వాసులు

సంక్షిప్త వార్తలు

◆ **చలివేంద్రాల ఏర్పాటు**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెద్దాల శ్రీనివాస్ సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, పెద్దాల శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు భరత్, కార్యదర్శి కొండ్ల శ్రీనివాస్, రవీంద్రప్రసాద్, కచ్చు రాజయ్య, రవీందర్, మహేందర్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

తోటపల్లిలో ...

బెజ్జంకి, మండలంలోని తోటపల్లిలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్ర ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధి వట్టి సుజాత తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏటా సావర్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. సేవే లక్ష్యంగా సావర్కర్ సేవా సమితి సేవా కార్యాక్రమాలను నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు.



◆ **రేషన్ బియ్యం పట్టివేత**

జగదేవ్‌పూర్(గజ్వేల్): అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయమైన సమాచారం మేరకు మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో వల్లాల వెంకటేష్, రాములు, లక్ష్మీనర్సయ్య ఇళ్లలో అనుమతి లేకుండా అక్రమంగా 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా టాస్క్‌ఫోర్స్, జగదేవ్‌పూర్ పోలీసులు బియ్యం నిల్వ చేసినవారి ఇళ్లపై దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

◆ **మత సామరస్యానికి రంజాన్ ప్రతీక**

వర్గల్(గజ్వేల్): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటుచేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి వర్గల్ మండలం మైలారంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. సామూహిక నమాజ్ అనంతరం ముస్లింలకు పండు తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలసారం ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు యూసఫ్ జానీ, ఎంపీపీ లత, జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్, నాయకులు భిక్షపతిరెడ్డి, కృష్ణ, మురళీగౌడ్, షౌకత్, హస్నొద్దీన్, నజీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతు**

దుబ్బాకరూరల్: చెరువులో ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని అప్పనపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన అశంల దేవానందం(42) మరొక వ్యక్తితో కలిసి ఈతకు వెళ్లాడు. చెరువులో లోపలికి వెళ్లి బయటకు రాలేదు. రాత్రి వరకు గాలింపు చేర్యలు చేపట్టిన ఆచూకీ లభించలేదు.

◆ **ఇంటి తాళం పగులగొట్టి చోరీ**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చెప్యాలలో ఓ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు మిరుదొడ్డి ఎస్‌ఐ పర్శరామ్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన అక్కిరాజు సత్యనారాయణ ఈనెల 4వ తేదీన ఇంటికి తాళం వేసి అంకిరెడ్డిపల్లిలో ఉండే అత్తగారింటికి వెళ్లాడు. ఆదివారం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచిన అర తులం బంగారం, 20 తులాల వెండి వెస్తువులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ **ప్రభుత్వ భూముల పరిరక్షణకు తోడ్పడాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ భూముల పరిరక్షణకు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు పాత్రికేయులు తమవంతు తోడ్పాటునందించాలని మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ కోరారు. ఆదివారం మానకొండూర్ నియోజకవర్గ పాత్రికేయులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసన్నారు. మాజీ ప్రజాప్రతినిదులు, బీఆర్‌ఎస్ నాయకులు గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలను వెలికి తీస్తామన్నారు.